# 28. కిటుకు

"కనకారావుకు కొడుకు పుట్టాడు. ఇవాళ సాయింత్రం టీపార్టీ."

ఈ బులెటిన్ సుందర్రావుక్కూడా జేరింది. మిగతా గుమస్తాల్లాగు ఆ టీపార్టీని గురించీ, అక్కడ ఇచ్చే తినుబండారాల్ని గురించీ అతను ఆలోచించటం లేదు... రేపు తనకు గూడా కొడుకు పుడితే?

ఒక్కసారి అతని శరీరం జలదరించింది. తన భార్య కాపరానికి వొచ్చిన యీ మూడు సంవత్సరాలనుంచీ డబ్బుకు మహా కటకటగానే వుంది. ఈ కారణంగా అతను ఎన్నో ఇతర సౌఖ్యాల్ని వొదులు కున్నాడు. ఐనా కూడా కొత్తదంపతుల ఆనంద జీవితమూ సుఖసౌఖ్యాలు అతనికి దూరమయినై. ఇలాటి పరిస్థితుల్లో తనకు కొడుకు పుడితే...? అంటే తమ సంసారంలోకి ఇంకో కొత్తవ్యక్తి వస్తే, మరింత భారమైన జీవితం తయారౌతుంది. ఇన్నాళ్ళూ అతనికీ ఆలోచన రాలేదు. దానికి కారణం- అతనిలోని ఆ ఉద్దేశం తగినంత గాఢంగా లేక పోవడమే! లోకంలో సంతానం కలగటమనేది ఓ పెద్ద విశేషం కాదుకాని, మనం చూసీ చూడనట్టు వొదిలేసే అనేక విషయాల్లాగే, యీ విషయం కూడా సుందర్రావు దృష్టిని అంతగా ఆకర్షించ లేక పోయింది!

తను బైటి సౌఖ్యాలన్నీ వొదులుకున్నా, ఇంటిదగ్గర అందమైన యువతి తనకు భార్యాత్వాన్ని వహించి, తన సేవకు సంసిద్ధురాలుగా వున్నదనే తలపు, అతని హృదయంలో మాటిమాటికి మెరుస్తూండటం వల్ల- తనకు దక్కని సుఖాలను గూర్చిన బాధకు అది అంజనం అయేది. ఇక ముందు ముందు సంతాన ప్రాప్తి ఐతే- ఆమె అందమూ ఆరోగ్యమూ చెడక, కనీసం తగ్గక తప్పదు. అప్పుడు వారిద్దరి మధ్య వున్న ప్రేమకు కొంత దెబ్బ తగులుతుంది. ఇద్దరి హృదయాల్లోనూ ఆ కొత్తగా దిగుమతయే

శిశువుకు తగిన స్థానాన్ని ఇవ్వవలసి వుంటుంది. ఇప్పటివలె కాక తనకు ఇంటి వద్ద సౌఖ్యం ఒక భాగమే అవుతుంది.

అసలు మొదటి నుంచీ పిల్లలంటే అతనికి ఎంతో అసహ్యం. వాళ్ళు నవ్వుతూ ఆడుకొని, మిగతావాళ్ళను ఏడిపించకుండా ఉన్నంత వరకూ ఫర్వాలేదు కాని - వాళ్లు ఏడిస్తే మాత్రం వాళ్లను చంపెయ్యాలన్నంత క్రోధం అతనిలో ప్రజ్వరిల్లటం పరిపాటైంది. అంటే తన చిన్నతనంలో తను మాత్రం పిల్లవాడుగా ఇంత గోలా చెయ్యలేదా అనేది వేరే ప్రశ్న! అసలు తను పిల్లవాడుగా ఎలా పెరిగాడో తనకు గుర్తులేదు; గుర్తు తెచ్చుకునేందుకు ప్రయత్నించటం బాధాకరం కనుక, దాని జోలికి పోవటం కూడా అనవసరమే! పిల్లలు అమాయకులే కావొచ్చు; ఇల్లంతా ఖరాబుచేస్తూ, ఇంటి పెంకులు (సుందర్రావు ప్రస్తుతం ఉంటూన్నది డాబా ఐనప్పటికీ!) ఎగిరి పొయ్యేట్లు ఏడుస్తూ భూలోక స్వర్గాన్ని నరకం చేసే దుర్మార్గులనే అభిప్రాయం అతనికుంది.

ఇన్నాళ్ళు ఆ అభిప్రాయం చెప్పుకోతగ్గంత భీకర రూపాన్ని దాల్చలేదు కాని, ఇప్పుడు మాత్రం అతన్ని ముంచెత్తింది.

ఆ సాయంత్రం దాకా ఇవే ఆలోచనలు. అసలు తను భార్యను చూస్తూ ఊరుకుంటూ, మానసిక ప్రణయాన్ని అనుభవిస్తూ యీ తుచ్ఛ కామం కోసం ప్రయత్నించకుండా ఉంటే యీ సమస్య ఉండదు. యీ అభిప్రాయం అత్యుత్తమమైనదే కాని, దీన్ని క్రియారూపంలో పెట్టటం తన తలకు మించినపని, తను అనుభవించలేక కాదుకాని, అనుభవించకూడదని నిశ్చయించుకున్న వ్యక్తి ఎంత అందంగా వున్నా, ఎంత ఆనందంగా వున్నా తనకు అనవసరం. ఇలాటిదే సాధ్యమయేట్టయితే తన భార్య కన్నా అందమైన యువతుల్ని చూస్తూ తృప్తిపడొచ్చు. ఆ యువతులు తమ తండ్రుల కూతుళ్లుగా వున్నా, భర్తల దగ్గర భార్యలుగా వున్నా తనకు భేదం బహుకొద్ది! అసలు తను పెళ్ళి చేసుకుంది సంసారం చేసేందుకే కాని సన్యాసాన్ని ఆరాధించేందుకు మాత్రం కాదు.

పోను పోను తనకీ సమస్య మరీ బిరుసెక్కింది. దీన్ని ఏమాత్రం అశ్రద్ధ చేసినా తను జీవితమంతా బాధపడవలసి వుంటుంది.

ఆ సాయంత్రం అతను కనకారావు టీ పార్టీకి పోవటానికి బదులు సరాసరి డాక్టర్ స్నేహితుడు దగ్గరకు వెళ్ళాడు.

## 2

గంట వరకూ డాక్టర్‌తో మాట్లాడాడు.

"ఐతే నీ కసలు ఎప్పటికీ పిల్లలు అక్కర్లేదు. అంతే గదూ?" అన్నాడు డాక్టర్.

"ఔను."

"బాగా ఆలోచించుకో. తరువాత కావాలంటే పుట్టరు. నీ భార్యతో కూడా ఆలోచించి చూడు."

"అక్కర్లేదు. నేను నిశ్చయించుకునే వొచ్చాను."

"సరే... ఎల్లుండి ఆపరేషన్‌కు సిద్ధమవు."

సుందర్రావుకు ఒక పెద్ద కొండ నెత్తిమీద నుంచి దిగినట్టయింది, యీ సంగతి భార్యకు చెపితే? ఒక వేళ ఆమె ఇష్టపడకపోతే?... ఆమె ఇష్టం ఏమిటి? పుట్టబోయే సంతానాన్ని పోషించాల్సింది తను. ఆ భారం తనకు తెలుసు. ఇతరుల కోసమని ఎంత బతుకుతున్నా, స్వార్థం లేకుండా బతకటాన్ని మానవుడు ఏ యుగంలోనూ రుజూచేసి ఉండలేదు, కనుక తన భార్య అభిప్రాయాన్ని తీసుకోవాల్సిన అవసరం లేదు. ఆమె అభిప్రాయం ఏదైనప్పటికీ, సంసారయాత్రలో ఆమె కూడా భాగస్వామిని కనుక తెలియ పరుస్తేనే చాలని నిశ్చయించుకున్నాడు.

ఆ రాత్రి రెండింటిదాకా ఆమె యీ పని చేయ వొద్దని ఎంతో బతిమాలుతూ చెప్పి చూసింది. కాని సుందర్రావు వినే స్థితిలో లేడని దృఢంగా నిశ్చయించుకున్నాక, ఆమె ఆ ప్రయత్నం నుంచి మానుకున్నది. యీ స్వల్ప విషయం ఇష్టాయిష్టాలతో కూడుకున్నది. తమ దాంపత్యం చెడకుండా ఉంటే అదే చాలనే స్థితికికూడా ఆమె వచ్చింది.

అనుకున్న ప్రకారం ఆపరేషన్ విజయవంతంగా కొనసాగింది. సుందర్రావు తన జీవితమంతా ఎంతో స్వేచ్ఛగా బాధ్యతారహితంగా హాయిగా గడప గలననే ధైర్యంతో కళకళలాడి పోసాగాడు.

## 3

రెండు సంవత్సరాలు గడిచేప్పటి వరకూ సుందర్రావు సంసారంలో సమస్యలంటూ రాలేదు. కాని ఒకనాడు హఠాత్తుగా తనకు మూడో నెల అని భార్య చెప్పినప్పుడు సుందర్రావు చకితుడయ్యాడు.

వెంటనే డాక్టర్ దగ్గరకు పరుగెత్తాడు. డాక్టర్‌కు కూడా ఏమీ పాలు పోలేదు. చాలాసేపు ఆలోచించాడు.

"ఆపరేషన్ పొరపాటున ఒక వైపుకు బదులు ఇంకోవైపు జరిగిందేమో ననే అనుమానం కలుగుతోంది. ఐనా మించి పోయిందేమీ లేదు. యీసారి రెండో వైపున చేస్తాను. ఐన దానికి విచారపడటం మాని, రానున్న బెడదనుంచన్నా తప్పించు కునేందుకు ప్రయత్నిద్దాం" అన్నాడు డాక్టర్ సుందర్రావుతో.

సుందర్రావుకు అది గుడ్డిలో మెల్లగా తోచింది. యీ సమస్య విషయంలో అతను ప్రాణాన్ని తప్ప ఇంక దేన్నయినా సరే త్యాగం చేసేందుకు సిద్ధంగానే ఉన్నాడు.

రెండోసారి కూడా ఆపరేషన్ పూర్తయింది. యీ సారి అలాటి పొరపాట్లేమీ జరగ లేదనీ, ఇకముందు యీ గురి తప్పే వీలుండదనీ డాక్టర్ నమ్మకంగా చెప్పాడు.

ఆ సంవత్సరం సుందర్రావుకు కొడుకు పుట్టాడు. అతను టీపార్టీలు చేయలేదు సరికదా - ఆ వార్తను తన స్నేహితులక్కూడా అందించలేదు. సుందర్రావులాటి వ్యక్తి అలాటి పని చేస్తాడని మనం పొరబడవలసిన పనికూడా లేదు!

మళ్ళీ సంవత్సరం గడిచింది. ఏదో ఆ పిల్లవాడితో సుందర్రావు అవస్థ పడుతున్నాడు. వాడు తన యింటికి రాకూడదని ఎన్నో కట్టు దిట్టాలు చేశాడు కాని, చివరకు విధివశాన వాడు దిగుమతి అయాడు. తీరా వొచ్చాక తప్పనిసరై వాణ్ణి పెంచుకు రాసాగాడు. అంతకన్న వేరే విశేషా లేమీ లేవు.

నాలుగు నెలలు గడిచినవి. సుందర్రావుకు మళ్ళీ అనుమానంగానే వుంది. ఇక ఆగలేక భార్యను అడిగాడు. ఆమె చాలాసేపు బతిమాలాక కాని రహస్యం చెప్పలేదు. యీ సారి ఆమెకు నాలుగో నెలని విన్నాక, సుందర్రావు గతుక్కుమన్నాడు. గర్భం రావటం ఆమె కెంత ఆనందంగా వుందో తనకు అంత ప్రాణసంకటంగా వుంది. ఆమె ఆనందాన్ని తను పంచుకోలేదు; తన బాధను ఆమె అర్థం చేసుకో లేదు. అదే అవస్థ!

యీసారి సుందర్రావుకు విధి మీద కాక, డాక్టర్ మీదా, వైద్యశాస్త్రం మీదా, విపరీతమైన కోపం వొచ్చింది. తనకు పేర్లు తెలిసిన శాస్త్రజ్ఞుల్నీ, డాక్టర్లనూ తిట్టాడు. అది చాలక మొత్తం అందర్నీ కూడా పేరు పేరున కాకుండా కలిపి దుమ్మెత్తి పోశాడు. అసలు మనిషి దగ్గర కాకుండా తనలో తను యీ తిట్లు తిట్టటం వల్ల ప్రయోజనం ఉండదని ఆ ధాటీ బాగా చల్లారాక కాని తెలుసుకోలేకపొయ్యాడు.

యీసారి సుందర్రావు వాలకం చూసి డాక్టర్ కూడా భయపడ్డాడు. తననేకాక, వైద్య శాస్త్రాన్నే తిడుతూన్న సుందర్రావు స్థితిని అతను అర్థం చేసుకున్నాడు. ఒక రోగి చనిపోయినంత మాత్రాన, శాస్త్రమే తప్పని చెప్పటంలోని న్యాయాన్ని డాక్టర్ సైతం అర్థం చేసుకోలేక పొయ్యాడు.

సుందర్రావు అలసి పొయ్యాక డాక్టర్ అన్నాడు: "ఇంతకూ అది గర్భమేనని నిశ్చయంగా చెప్పటం ఎలా? మూఢ గర్భం కావొచ్చు. నువ్వేమీ తొందరపడ నక్కర్లేదు. కాస్త ఆగితే అన్ని విషయాలూ నిశ్చయంగా వాటంతట అవే తెలుస్తవి."

సుందర్రావు తను తొందరపడ్డానేమోననే పశ్చాత్తాపానికి గురయ్యాడు. డాక్టర్ అంత నమ్మకంగా చెప్పాక, తను మరికొంత ఓర్పును ప్రదర్శించి ఉండవలసింది. ఆ నాటికి సెలవు తీసుకొని, అక్కణ్నుంచి తప్పించుకొని బైటబడ్డాడు.

సుందర్రావుకు ఇప్పుడు కాస్త ధైర్యంగా వుంది. డాక్టర్ చెప్పిన మాటల్లో అతనికి తిరిగి ఇంకోసారి నమ్మకం చిక్కింది. అదీకాక, కిందటిసారివలె గాక, తన భార్యలో ఎంతో మార్పు కనిపించ సాగింది. అది మామూలు గర్భం వలె కాక, విశేషమైన పెరుగుదలగా తోచటం వల్ల డాక్టర్ చేత పరీక్ష చేయించా లనుకున్నాడు సుందర్రావు.

కాని ఆమె - తన కేమీ జబ్బులేదని చెప్పేది. చివరకు సుందర్రావుకు ఇదేదో మూఢగర్భం లాంటిదే కాకపోతే ఇంత పెరుగుదల ఉండదనే ధైర్యం కలిగింది. డాక్టర్ చేత పరీక్ష చేయించుకోక పోతే ఆ నష్టం ఆమెదే కనుక, ఇక ఆమెను ఆ విషయంలో బ్రతిమాలటం కూడా అనవసరమని అతను అనుకున్నాడు.

నెలలు నిండాయి. సుందర్రావు భార్య ప్రసవించింది- యీసారి ఆమెకు కవల పిల్లలు!

పిల్లల ఏడ్పువిన్నాక కాని సుందర్రావుకు దృఢమైన నమ్మకం కలగలేదు. ఇప్పుడు అతని మంట చూస్తే మూడో కన్ను వుంటే యీ లోకం ఏమయ్యేదో నని మనకు అనుమానం కలుగుతుంది!

ఆ అర్ధరాత్రి డాక్టర్ దగ్గరకు పరుగెత్తాడు. డాక్టర్‌ను నానా మాటలు అన్నాడు. "ఇలా జరుగుతుందని నీకు తెలియకపోతే నీ శాస్త్రం దేనికి? నీ చికిత్స ఎందుకు?" అన్నాడు.

డాక్టర్ కొంచెం దీర్ఘంగా ఆలోచించాడు. సుందర్రావు వాక్ ప్రవాహాన్ని బలవంతాన ఆపి ఇలా అన్నాడు:

"శాస్త్రాన్ని దూషించవోక. కారణం తెలుసుకొని తరువాత తప్పు ఎవరి వల్ల జరిగిందో చూడాలి. మొదటిసారి తప్పుగా ఆపరేషన్ జరిగిందనుకున్నాను. రెండోసారి అలాటి తప్పును సరిదిద్దుకున్నాననే ధైర్యం కలిగింది. కాని ఆ తప్పు తప్పుగానే ఉండిపోయిందని ఇప్పుడు నువ్వంటున్నావు-?"

"అంటాను- అబద్ధ మేముందీ?"

"కాని అదికాదు. పొరపాటు నాది కాదు. ఆపరేషన్ సరైన వ్యక్తికి జరగలేదని నేను నిశ్చయంగా చెపుతున్నాను. జరగవలసిన వ్యక్తికి జరిగినట్టయితే ఈ పరిస్థితి వొచ్చేది కాదు! ఇది నిజం!" అంతకు ముందు పెద్ద పోట్లాటవలె ధ్వనిస్తూన్న ఆ గది రెండు నిమిషాల్లోనే ప్రశాంతమైంది.

- ఏప్రిల్, *1949*